క్లుప్తంగా

గుండెపోటుతో రైతు మృతి



పర్వతగిరి: మండల కేంద్రానికి చెందిన రైతు బక్కి వెంకన్న (50) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. మృతుడి బంధువుల కథనం ప్రకారం.. వెంకన్న వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన ఉదయం 6 గంటల సమయంలో ఛాతిలో నొప్పిగా ఉందని తెలుపడంతో కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంకన్నను 108 వాహనంలోకి ఎక్కించగానే గుండెపోటు ఎక్కువై మృతి చెందాడు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలున్నారు. వెంకన్న కుటుంబాన్ని ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కుసం రామచంద్రు ప్రభుత్వాన్ని కోరారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు..

గీసుకొండ: మండలంలోని కొనాయమాకుల సమీపంలో వరంగల్–నర్సంపేట రహదారిపై నర్సంపేట వైపు వెళ్తున్న ప్రైవేట్ అంబులెన్స్ బోల్తాపడిన ఘటనలో గాయాలపాలైన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. వివరాలిలా.. నర్సంపేట పట్టణానికి చెందిన బూర్గు వీరన్న (62) అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబీకులు ఎంజీఎంలో చేర్చారు. వైద్యపరీక్షలు అంతా నార్మల్‌గా రావడంతో కుటుంబీకులు ఈనెల 19న ఆయన్ను ప్రైవేటు అంబులెన్స్‌లో నర్సంపేటలోని ఇంటికి తీసుకెళ్తుండగా కొనాయమాకుల సమీపంలో అంబులెన్స్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయాలపాలైన వీరన్న, అతడి భార్య కొంరమ్మ, కూతుర్లు రజిత, లత గాయాలపాలయ్యారు. వీరన్న ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా అతడి భార్య, కూతుర్లు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

నివాళి



వర్ధన్నపేట: వర్ధన్నపేటకు చెందిన చిటిమళ్ల నర్సింహాచారి (70) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందగా ఆయన మృతదేహానికి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన శతాధిక వృద్ధురాలు గబ్బెట రామలక్ష్మి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అరూరి వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, వైస్ చైర్మన్ కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి, ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, కౌన్సిలర్లు తోటకూరి రాజమణి, మంచాల రామకృష్ణ, పూజారి సుజాత రఘు, సుభాశ్, తుమ్మల యాకయ్య, వెంకన్న, వీరరాఘవరావు, సురేశ్ తదితరులున్నారు.

కాంగ్రెస్ నాయకుల..

నర్సంపేట: నర్సంపేటకు చెందిన అపరాధపు వెంకటమ్మ అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందగా ఆమె మృతదేహానికి కాంగ్రెస్ నాయకులు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పట్టణ కమిటీ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్య గౌడ్, కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్ర యాకూబ్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు మెరుగు సాంబయ్య, గాజుల రమేశ్, పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి మాదాసి రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



గీసుకొండ: మండల కేంద్రానికి చెందిన పేదలు దౌడు ఎల్లయ్య, సారంపెల్లి విజయ, పొగాకు విజయ ఇటీవల వేర్వేరుగా అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు గ్రామానికి చెందిన రిటైర్డ్ స్టేట్ బ్యాంకు మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ గురువారం రూ.5 వేల చొప్పున సాయం అందించారు. తొలుత బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పొగాకు కిష్టయ్య, సోషల్ సర్వీస్ టీం సభ్యుడు ముల్క సత్యనారాయణ, నేతాజీ సర్వీస్ టీం అధ్యక్షుడు మెగసాని శంకర్ పాల్గొన్నారు.

స్నేహితుడికి..

రాయపర్తి: మండలంలోని పెర్కవేడు గ్రామానికి చెందిన గారె ఎల్లయ్య ఇటీవల మృతి చెందగా అతడి కొడుకు గౌస్‌కు అతడి టెన్త్ నాటి మిత్రులు గురువారం రూ.25 వేల సాయం అందించారు. తొలుత గౌస్‌ను అతడి స్నేహితులు పరామర్శించారు. కార్యక్రమంలో గౌస్ స్నేహితులు కొంక మురళి, గడిపెల్లి రాజు, రామావత్ వాసు, మనోజ్, సునీల్, మూనావత్ శ్రీను, మూనావత్ గోపాల్, ఊగ భిక్షపతి, రంగు వేణు, తీగల ప్రశాంత్ పాల్గొన్నారు.

‘ఈ-కేవైసీ’ పుకార్లతో జనం వెతలు



గ్యాస్ ఏజెన్సీ ఎదుట బారులు దీరిన వినియోగదారులు

రాయపర్తి: వంట గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలంటూ సామాజిక మాధ్యమాల్లో కొద్ది రోజులుగా పుకార్లు షికారు చేస్తుండడంతో పల్లెల్లోని ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. ఈ-కేవైసీ చేయించుకోకుంటే రూ.500కు గ్యాస్ రాదనే వదంతులు వ్యాపిస్తున్నాయి. ఈ క్రమంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్దకు తండోపతండాలుగా తరలి వస్తున్నారు. పలు గ్రామాల ప్రజలు మండల కేంద్రంలోని అమూల్య (హెచ్‌పీ) గ్యాస్ ఏజెన్సీకి గురువారం భారీ సంఖ్యలో చేరుకోగా క్యూలైన్ స్థానిక వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపైకి చేరుకుంది. ఈ-కేవైసీ చేసుకోవాలా? వద్దా? అనే విషయమై సైతం లబ్ధిదారులు అయోమయంలో పడుతున్నారు. పలువురు మహిళలు ఉదయమే గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి చేరుకుని ఈ-కేవైసీ చేయించుకునేందుకు అవస్థలు పడుతుండడం కనపడుతోంది. గంటల కొద్దీ క్యూలో నిల్చోవాల్సి వస్తుండడంతో గ్యాస్ వినియోగదారులు తాగునీటి, ఇతర వసతుల కోసం, తదితర అనేక సమస్యలతో సతమతమౌతున్నారు. ఈనెల 30లోగా ఈ-కేవైసీ చేయించుకోవాలనే పుకార్లు జోరుగా సాగుతున్నాయి. ఈ-కేవైసీ విషయమై గ్యాస్ కంపెనీల అధికారులు, ప్రభుత్వం అవగాహన కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు



క్యాండిల్స్‌తో కారెల్స్ నిర్వహిస్తున్న క్రైస్తవులు

చెన్నారావుపేట: మండల కేంద్రంలోని సిద్దార్థ గురుకుల హైస్కూల్‌లో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ ఉపాధ్యాయులు కేక్ కట్ చేసి ప్రసంగించారు. శాంతి సందేశం అందించడానికే ఏసుక్రీస్తు లోకానికి వచ్చాడని తెలిపారు. రక్షకుడిగా క్రీస్తును అంగీకరించాలని సూచించారు. సమాజంలోని ప్రతీఒక్కరూ ఏసుక్రీస్తు చూపిన బాటలో పయనించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం అండెం కరుణాకర్ రెడ్డి, ఆర్.బాలరాజు, అర్లయ్య, విష్ణు, కందిక నవీన్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ క్యారెల్స్

మండలంలోని సూర్యపేట తండాలో బుధవారం రాత్రి క్రిస్మస్ క్యారెల్స్ ఘనంగా నిర్వహించారు. పాస్ట్రేట్ చైర్మన్ రెవరెండ్ సహోదర్ ఆధ్వర్యంలో క్రైస్తవ భక్తులు క్యాండిల్స్ వెలిగించి ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ గీతాలు ఆలపిస్తూ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో వరంగల్ గ్రూప్ సెక్రటరీ ఆకుల అశోక్‌గౌడ్, పాస్ట్రేట్ సెక్రటరీ గోపు శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ అండ్ ఇవాంజలిజమ్ సెక్రటరీ గట్ల రవీందర్, యూత్ సెక్రటరీ గట్ల హనోక్, ట్రెజరర్ శంకేసీ రంజిత్, స్త్రీల మైత్రి సెక్రటరీ గాండ్ల మంజుల, ట్రెజరర్ ఆకుల సుభాషిణి, సాంబయ్య, మర్రి రమేశ్, పంథ అనిల్, సూర కార్తీక్, గాండ్ల అరుణ్, చిర్ర రవయ్య, కృపాంజలి, స్వరూపరాణి, రిబ్క, సుభద్ర, లలిత, భ్రదు, నాగు, జయరాం, శ్రీను, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలే ‘జేడీ’ ధ్యేయం



దుప్పట్లు పంపిణీ చేస్తున్న కవిత



నిత్యావసర వస్తువులు అందిస్తున్న కవిత

నల్లబెల్లి: పేదలకు సేవలు అందించడమే జేడీ ఫౌండేషన్ ధ్యేయమని కన్వీనర్ కవితరెడ్డి తెలిపారు. మండలంలోని గొల్లపల్లిలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం దుప్పట్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కవితరెడ్డి మాట్లాడారు. చలి తీవ్రత నేపథ్యంలో ఫౌండేషన్ చైర్మన్ జేడీ లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు గ్రామంలోని పలువురు పేద వృద్ధులకు దుప్పట్లు, వస్తువులు పంపిణీ చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యాక్రమాలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ బాధ్యులు అనుముల జయేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు హేమవతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం



సంగెం: లయన్స్‌క్లబ్ ఆఫ్ కనకదుర్గ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ చంద్రశేఖర్ పలువురికి ఉచిత వైద్యపరీక్షలు చేశారు. సుమారు 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 40 మందికి క్యాటరాక్ట్ శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. అవసరమైన వారికి ఈనెల 27న శస్త్రచికిత్స చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ వనజ, సులోచన, విజయలక్ష్మి, శోభ, రాజశేఖర్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



నైవేద్యం తీసుకొస్తున్న అన్నదాతలు

నర్సంపేట: పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్‌గుప్తా ఆధ్వర్యంలో 23వ మండల పూజా మహోత్సవాలు, మహాఅన్నదాన కార్యక్రమం గురువారం కొనసాగాయి. ఈ మేరకు అర్చకులు అయ్యప్పస్వామికి అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శీలం నాగలక్ష్మి రామకిశోర్‌రెడ్డి, డాక్టర్ హిమబిందు డాక్టర్ శివానంద్‌నాయక్, లక్క నరేందర్, జాటోతు మంజిలాల్ అయ్యప్పస్వాములు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ మాధవ శంకర్ మాట్లాడారు. ఈనెల 26 నుంచి 29 వరకు జరిగే మహా కుంభాభిషేకంలో పాల్గొనాలని కోరారు. 12 ఏళ్లకోసారి వచ్చే మహా కుంభాభిషేకంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో మాదారపు చంద్రశేఖర్ గుప్తా, దొడ్డ రవీందర్, శ్రీరాం ఈశ్వరయ్య, చింతల కమలాకర్‌రెడ్డి, శ్రీరాముల శంకరయ్య, భూపతి లక్ష్మినారాయణ, శింగిరికొండ వేణుగోపాల్, దొడ్డ వేణు, మల్యాల రాజు, భరత్, కార్తీక్, రాము, శ్రీధర్, రాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సేవా సంపర్క్‌తో యువజనాభివృద్ధి



ప్రతిజ్ఞ చేస్తున్న సేవా కార్యకర్తలు

వర్ధన్నపేట: మండలంలోని ఇల్లందలో భారత్ వికాస్ పరిషత్ సంస్కార సేవా సంపర్క్ ద్వారా సమాజానికి గ్రామంలోని యువతకు పలు రకాల అభివృద్ధి దోహద సేవలు అందిస్తోంది. ఈ కార్యక్రమానికి గ్రామంలోని యువత క్రమశిక్షణతో ముందుకొచ్చారు. సేవ కార్యక్రమాలు చేసే ముందు అందరూ ప్రతిజ్ఞ చేస్తారు. ఇందులో భాగంగా గురువారం ఇల్లందలో అంగన్‌వాడీలు, ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగులు సేవా కార్యక్రమాల్లో కార్యకర్తలుగా పాల్గొని పలు సేవలు అందించారు. తొలుత ప్రతిజ్ఞ చేశారు. సంస్కార యోజన ద్వారా పిల్లలు, యువత, కుటుంబం, సీనియర్ సిటిజన్ల కోసం అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వాటిలో ప్రధానమైనది పిల్లల సంస్కార శిబిరం, జాతీయ సంస్కృత పాటల పోటీలు, భారత దేశాన్ని తెలుసుకో, యువ సంస్కార శిబిరం, దివ్యాంగుల సంక్షేమం, పునరావాసం, గిరిజన అభివృద్ధి, గ్రామీణ పట్టణ మురికివాడల అభివృద్ధి, సామూహిక సాధారణ వివాహం, సేవా పథకం ద్వారా మహిళలు, పిల్లలకు న్యాయసలహా, తదితరాలను ఈ సంస్థ నిర్వహిస్తోంది. ఎప్పటికప్పుడు సంస్కృతి వారోత్సవాలు, వ్యవస్థాపక దినోత్సవం, ప్రతిభా సమ్మాన్, సెమినార్లు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పరామర్శ



రాయపర్తి: మండలంలోని రాగన్నగూడెం గ్రామానికి చెందిన రెంటాల నర్సింహారెడ్డి ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దాస్యం వినయ్‌భాస్కర్ గురువారం పరామర్శించారు. అనంతరం నర్సింహారెడ్డి కొడుకులైన కేశవరెడ్డిని, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డిని, ప్రభాకర్‌రెడ్డిని ఓదార్చారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడారు. నర్సింహారెడ్డి మృతి బాధాకరమన్నారు.

అవగాహనతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, ఇతరులు

నెక్కొండ: అవగాహన కలిగి ఉండడం ద్వారా బాలల, మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయొచ్చని ఎంఈఓ రత్నమాల తెలిపారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో ×మానవ, బాలల అక్రమ రవాణా నిర్మూలన×పై ముద్రించిన వాల్‌పోస్టర్లను గురువారం ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. బాలల హక్కులు, చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలలపై లైంగిక వేధింపులు, బాలల అక్రమ రవాణా, తదితరాలను అరికట్టడంలో సమాజంలోని ప్రతీఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అనుమానితులు, అపరిచితుల పట్ల బాలలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. హైస్కూల్ స్థాయిలో చిల్డ్రన్ క్లబ్‌లు, గ్రామ పంచాయతీల్లో గ్రామ నిఘా కమిటీలు ఏర్పాటు చేసి ప్రజల భాగస్వామ్యంతో సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. బాలల విషయంలో నిర్లక్ష్యం తగదని స్పష్టం చేశారు. సమావేశంలో సంస్థ ఫీల్డ్ కోఆరినేటర్ బెజ్జంకి ప్రభాకర్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత శిక్షణ

రాయపర్తి: శారీరక, వినికిడి లోపం కలిగిన దివ్యాంగులకు డాటా ఎంట్రీ ఆపరేటర్, సేల్స్ అసోసియేట్ ఉద్యోగాలకు హనుమకొండలోని న్యూసైన్స్ పీజీ కళాశాల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు గణా సొసైటీ డైరెక్టర్ మచ్చ రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు ఉచితంగా హాస్టల్ వసతి సైతం కల్పిస్తామని పేర్కొన్నారు. అలాగే శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం నుంచి ఎన్ఎస్‌డీసీ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని దివ్యాంగ నిరుద్యోగ యువతీ యువకులు వినియోగించుకుని ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 9030163042లో సంప్రదించాలని సూచించారు.

‘ఇండియా కూటమి క్షమాపణ చెప్పాలి’



నిరసన తెలుపుతున్న నాయకులు

నర్సంపేట: పార్లమెంటులో గందరగోళానికి కారణమైన ఇండియా కూటమి సభ్యులు ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అమరవీరుల స్తూపం ఎదుట ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వెంకన్న ఆధ్వర్యంలో గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడారు. సదరు కుట్ర వెనుక కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రమేయం ఉందని ఆరోపించారు. 2024లో జరగనున్న సాధారణ ఎన్నికల్లో బీజేపీ మూడోసారి భారీ మెజార్టీతో అధికారం చేజిక్కించుకుంటుందన్న భయంతోనే బీజేపీని అప్రతిష్ట పాల్జేయాలని ప్రతిపక్ష పార్టీ కుట్రలు చేస్తోందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి పంజాల రము, యువమోర్చా నియోజకవర్గ కన్వీనర్ జూలూరి మనీశ్‌గౌడ్, యువమోర్చా పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, మండల అధ్యక్షుడు తనుగుల అంబేద్కర్, సీనియర్ నాయకులు రవీందర్‌సింగ్, సామల ప్రవీణ్ కుమార్, కోమండ్ల సప్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా తయారీలో సమర్థత చాటండి



సంగెం: ఓటర్ లిస్టు తయారీలో సమర్థత చాటాలని తహసీల్దార్ రాజ్‌కుమార్ చెప్పారు. మండల కేంద్రంలో బీఎల్ఓలకు గురువారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన వారి పూర్తి వివరాలు సేకరించి ఓటరు లిస్టు రూపొందించాలని సూచించారు. ఓటరు లిస్టులో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సదస్సులో ఏఎంపీఎస్ఓ సతీశ్, నాయబ్ తహసీల్దార్ బాలాజీ, శారద, రవి పాల్గొన్నారు.

భ్రూణహత్యల నివారణ అందరి బాధ్యత



నల్లబెల్లి: భ్రూణహత్యల నివారణను సమాజంలోని ప్రతీఒక్కరు సామాజిక బాధ్యతగా భావించాలని మండల కేంద్రంలోని హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వసంత ఆకాంక్షించారు. ‘బేటీ బచావో, బేటీ పడావో’ కార్యక్రమాన్ని ఆ స్కూల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వసంత మాట్లాడారు. భ్రూణహత్యల నివారణ కోసం సమాజంనడుం బిగించాలని సూచించారు. విద్యార్థి దశలోనే భ్రూణహత్యలు, ఇతర అంశాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. ‘కౌమర దశ విద్యార్థులకు మానసిక ఆరోగ్యం’ అంశంపై విద్యార్థులకు రిసోర్స్‌పర్సన్ గుడివాడ అశోక్ అవగాహన కల్పించారు. వ్యక్తిగత ఆరోగ్యం, పరిశుభ్రత కోసం విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్థానిక పీహెచ్ఎస్ఓ రజిని వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మాధవి, హర్షిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

16 మందికి వేసెక్టమీ ఆపరేషన్లు

ఐనవోలు: డిప్యూటీ డీఎంహెచ్ఓ యాకూబ్‌పాషా ఆధ్వర్యంలో 16 మందికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స(వేసెక్టమీ) విజయవంతంగా నిర్వహించినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో గురువారం వేసెక్టమీ ఆపరేషన్ల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. మొత్తం 16 మందికి అతి సునాయాసంగా వేసెక్టమీ శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. శిబిరంలో సీహెచ్ఓలు సునంద, సరస్వతి, పల్లె దవాఖాన డాక్టర్లు నవీన్, సరిత, పర్వీన్, విజయలక్ష్మి, కృష్ణమూర్తి, సతీష్‌చారి, రోజా, భాస్కర్, శ్రీకాంత్, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్‌ను ఇబ్బందుల్లోకి నెట్టొద్దు

● సీడీపీఓ భాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న సీడీపీఓ భాగ్యలక్ష్మి

శాయంపేట : చదువుకునే వయస్సు పిల్లలకు బాల్య వివాహాలు చేసి వారి బంగారు భవిష్యత్‌ను ఇబ్బందుల్లో నెట్టొద్దని సీడీపీఓ భాగ్యలక్ష్మి అన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ పాటుపడాలని సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్ఎం నాగలత అధ్యక్షతన బాల్య వివాహల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించగా ఆమె పాల్గొని మాట్లాడారు. బాలురతో సమానంగా బాలికలు విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఏవరైనా బాల్య వివాహాలు జరిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా బాలికల హక్కులను, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. విద్యార్థి దశలోనే బాలికలు సమాజంలోని రుగ్మతలపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంజుల, డీసీపీఓ సంతోష్, కేస్ వర్కర్ విజయ్, ఫైనాన్స్ లిట్రసీ అధికారి లావణ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ

ఐనవోలు: వరంగల్ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి అటల్ టింకరింగ్ సైన్స్ ఎగ్జిబిట్స్ ఫెస్ట్ 2023–24 మండలంలోని పున్నేలు క్రాస్ సమీపంలోని ఏకశిల సీబీఎస్ఈ అండ్ స్టేట్ స్కూల్ విద్యార్థులు సీనియర్ విభాగంలో మొదటి బహుమతి గెలుచుకున్నట్లు ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి తెలిపారు. ‘ఆటోమేటిక్ చార్జింగ్ ఫర్ ఎలక్ట్రానిక్ వెహికిల్స్’ థీమ్‌తో ఏర్పాటు చేసిన అంశం రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు వివరించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింత రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థులు సహస్ర, సామిత్రి, గైడ్ టీచర్, సైన్స్ హెడ్ బదావత్ రమేష్‌లకు పాఠశాల ఉపాధ్యాయులు గురువారం మొమెంటోలు అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల అడ్మిన్ ఇన్‌చార్జ్ బాబా, వైస్ ప్రిన్సిపాల్ కూనూరు రవి, కిరణ్, గుర్రం రమేష్, ఆర్ కిరణ్ కుమార్ రెడ్డి, అమర్‌నాథ్, నర్సయ్య, నరేష్, అరుణ్ పాల్గొన్నారు.

గేట్‌వాల్వ్ లీకేజీ.. వృథాగా భగీరథ నీరు



దామెర: గేట్‌వాల్వ్ లీకేజీతో మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్నాయి. మండలంలోని సీతారాంపూర్ గ్రామం నుండి ఆత్మకూరులో అగ్రంపహాడ్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న కల్వర్టు సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ గేట్‌వాల్వ్ లీకేజీ అయ్యింది. దీంతో నీరు వృథాగా పోతున్నాయి. స్థానికులు సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి సమాచారం అందించినప్పటికీ సాయంత్రం వరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో సమీప పొలాలు నీటితో నిండిపోయాయి. అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మత్తులు చేయాలని కోరుతున్నారు.